
రేపల్లె రూరల్: దేశభక్తి గీతానికి విద్యార్థినుల నృత్యం


ఐలవరం హైస్కూల్‌లో కల్నల్ జె. మహేష్‌కు సన్మానం


కొల్లూరు: త్రివర్ణ పతాకం ఆవిష్కరిస్తున్న ఈజీ మల్లికార్జున


రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మంగ, అధికారులు

# 75 వసంతాల సంపూర్ణ స్వరాజ్యం

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

గణతంత్ర రాజ్యానికి 75 ఏళ్లు. అతిపెద్ద రాజ్యాంగ ప్రజాస్వామ్యంలో ప్రజలు స్వేచ్ఛా వాయువులను మరొక్కసారి ఆస్వాదించారు. ఇందుకు కారకులైన స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను స్మరించుకుని, నివాళులర్పించారు. ప్రతి కార్యాలయంలో త్రివర్ణ పతాకం గౌరవ వందనం స్వీకరించింది. భారత రాజ్యాంగ గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ నెమరు వేసుకున్నారు. స్వాతంత్ర్య సాధన, రాజ్యాంగం అమలులో చరిత్ర ఎరిగిన ఎన్నో విజయాలను ఇప్పటి తరానికి వివరించారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


బాపట్ల అర్బన్: జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్


భట్టిప్రోలులో అంబేద్కర్ చిత్రపటానికి ప్రజా ప్రతినిధుల నివాళి


రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళి


చెరుకుపల్లి: జాతీయ పతాకానికి వందనం చేస్తున్న సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్


చుండూరులో జాతీయ జెండాకు తహసీల్దార్ కనకదుర్గ గౌరవ వందనం


పీవీపాలెం: గణగతంత్ర వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అశ్వినీరెడ్డి


వేమూరు ఎంపీడీఓ కార్యాలయంలోని జెండా వందనంలో జెడ్పీటీసీ హేమలత


వేమూరు: వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు


బాపట్ల అర్బన్: వ్యవసాయ కళాశాలలో డాక్టర్ వి.శ్రీనివాసరావు, కళాశాల సిబ్బంది


కొల్లూరు : జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ సత్యన్నారాయణరావు


నగరం: ఎంపీడీఓ కార్యాలయం జెండా వందనంలో ఎంపీడీఓ చక్రపాణి, ఎంపీపీ శ్రీకృష్ణయ్య


కర్లపాలెం రెవెన్యూ కార్యాలయంలో..

## క్లుప్తంగా

### విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

**పెసర్లంక(భట్టిప్రోలు):** సహృదయ సేవా సంఘం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగంపై విద్యార్థులకు శుక్రవారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 8, 9,10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఎం. భవ్యశ్రీ, టి.సుహిత, కీర్తి ప్రతిభ చూపారు. గ్రామ సర్పంచ్ వేములపల్లి వెంకటేశ్వరరావు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్కే మహబూబ్ బాషా, సేవా సంఘం కార్యకర్తలు బి.సునీత, పి. వెంకటరత్నం పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

**వేమూరు:** కష్టపడి చదువితే మంచి జీవితం ఉంటుందని ప్రిన్సిపల్ శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. దారా వెంకటరమణ అండ్ ముక్కామల క్రిష్ణవేణి మెమోరియల్ ప్రభుత్వం జూనియర్ కళాశాల 45వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అధ్యాపకుడు అప్పల నాయుడు పాల్గొన్నారు. కార్పొరేట్‌కు దీటుగా కళాశాలను ప్రభుత్వం తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. అధ్యాపకులు బసివిరెడ్డి, సుబ్బారావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

### చినపరిమిలో కేంద్ర పథకాలపై అవగాహన



**చుండూరు(భట్టిప్రోలు):** వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చుండూరు మండలం చినపరిమిలో శుక్రవారం నిర్వహించారు. పొగాకు బోర్డు మాజీ చైర్మన్ యడ్లపాటి రఘునాథ్ బాబు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కేంద్రం నుంచి 17 రకాల పథకాలు అందుతున్నాయని తెలిపారు. లబ్ధిదారులతో మాట్లాడారు. సర్పంచ్ మేరుగ సుభాషిణి, ఎంపీటీసీ అవుతు శివపార్వతీ, బీజేపీ సీనియర్ నాయకులు యడ్లపాటి స్వరూపరాణి, మంద జనార్దన్, పంచాయతీ కార్యదర్శి ఎ. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### ఖాతాదారులకు మెరుగైన సేవలు



**కర్లపాలెం:** ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని యూనియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.రవీంద్రబాబు సిబ్బందికి సూచించారు. స్థానిక తులసీ కాంప్లెక్స్‌లో ఉన్న యూనియన్ బ్యాంకు కార్యకలాపాలను.. వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ పక్కన నూతన భవనంలోకి మార్చారు. నూతన భవనంలో సేవలను జోనల్ మేనేజర్ రవీంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ డి.శంకర్‌రావు, బ్రాంచ్ మేనేజర్ శైలేష్ భగత్, యూనియన్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్లు వీర ప్రసాద్, ఎంఎం భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

**కొల్లూరు :** వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు నేతృత్వంలో కొల్లూరు గాంధీ నగర్ వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

### అడిషనల్ కమిషనర్ బదిలీ

**మంగళగిరి:** మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె హేమమాలిని బదిలీ అయ్యారు. ఆమె నూజివీడు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ కాగా ఆమె స్థానంలో కృష్ణా జిల్లా తాడిగడప మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్ ప్రకాశరావు మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న పి శ్రీనివాసరావు రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు.

### చర్చి నిర్మాణానికి శంకుస్థాపన

**మేడికొండూరు:** మండల పరిధిలోని పేరేచర్ల లక్ష్మీనరసింహ కాలనీలో నూతనంగా నిర్మించనున్న ఏఈఎల్సీ చర్చి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రెవరెండ్ ఫాదర్ ఎస్.జె.బాబూరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పేరేచర్ల సంఘ కాపరి ఎం.ప్రకాష్‌రావు, పలువురు ఫాదర్లు, సంఘస్తులు పాల్గొన్నారు.

## కనుల పండువగా సీతారాముల కల్యాణం

**అద్దేపల్లి(భట్టిప్రోలు):** అద్దేపల్లి శ్రీ రామ నామ క్షేత్రంలో నిర్వహిస్తున్న 72వ శ్రీ రామనామ స్మరణ కోటి మహోత్సవాల్లో శుక్రవారం సీతారామ కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. సుప్రభాత సేవ, సహస్ర నామార్చన చేపట్టారు. భగవద్గీత పారాయణం, శ్రీరామ స్తోత్రాలు, హరికథ కాలక్షేపం ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు కొన్నిపాటి భాస్కరరావు, కాగిత దుర్గా ప్రసాదరావు, కాగిత అంజనేయులు పర్యవేక్షించారు.


ప్రత్యేక అలంకరణలో సీతారామస్వామి

## నేడు విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

**భట్టిప్రోలు:** స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు అశోక్‌బాబు ట్యాబ్‌లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

## స్టేట్ టీచర్స్ యూనియన్ భవనానికి శంకుస్థాపన

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాలలో నూతనంగా నిర్మించే ఎస్టీయూ భవనానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీ సర్పంచ్ బాణావత్ కుషీ భాయి ఆధ్వర్యంలో పంచాయతీలో తీర్మానం చేసి యూనియన్ భవనానికి స్థలం కేటాయించారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ సాయిశ్రీనివాస్, గంజి చిరంజీవి సతీమణి రాధ, ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, సర్పంచ్ కుషీబాయి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎల్ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ దుగ్గిరాలలో భవనం నిర్మించుకోవడానికి పంచాయతీలో తీర్మానం చేసి స్థలం కేటాయించినందుకు సర్పంచ్ కుషీభాయి, ఎంపీడీఓ వీరయ్య, ఇతర అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎస్‌కె నాగూర్‌బాయి, ఎంఈఓ–2 కె.లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్ నాయక్, వార్డు సభ్యులు ఆత్మకూరు నాగేశ్వరరావు, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ తిమ్మన్న, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు సీహెచ్ జోసెఫ్ సుధీర్ బాబు, గుంటూరు జిల్లా అధ్యక్షులు డి.పెదబాబు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ అంబరీష్, రాష్ట్ర కార్యదర్శి కె.జోజప్ప, రాష్ట్ర ఆర్థిక కమిటీ సభ్యులు వి.ప్రసాద్‌రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.వి.సుబ్బారావు, దుగ్గిరాల మండల శాఖ అధ్యక్షులు ఉన్నం ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌కృష్ణ, తెనాలి ఏరియా కార్యదర్శి డి.వి. సుబ్బారావు పాల్గొన్నారు.


భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రేపల్లె రూరల్:** విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ పట్టణ ఏఈ ఏడుకొండలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకలవ్య బొమ్మ సెంటరు, రాజశ్రీ వక్కపాడి, ఒలివల కొండ చర్చి ఏరియా నుంచి కిసాన్ నగర్ వరకు, రైల్వే స్టేషన్, కృష్ణా టాకీసు ప్రాంతాలు, హౌసింగ్ బోర్డు కాలనీలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

**చుండురు (భట్టిప్రోలు):** చుండూరు మండలం యడ్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వలివేరు, పెనుగుదురు పాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఏఈ అర్జునరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

## నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా రామలింగేశ్వర్

**నెహ్రూనగర్:** నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పి.వి.రామలింగేశ్వర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. లక్ష్మీ శివజ్యోతి మాతృ శాఖ రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూల్ నగరపాలక సంస్థలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న రామలింగేశ్వర్‌ను గుంటూరు అదనపు కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. డెప్యూటీ కమిషనర్‌గా డి. వెంకటలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుతం డెప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న బి. శ్రీనివాసరావు సీడీఎంఏ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. విజయవాడలో డెప్యూటీ కమిషనర్ విజయలక్ష్మిని గుంటూరుకు ప్రభుత్వం బదిలీ చేసింది.

### అలరించిన గాత్ర కచేరీ

**పాత గుంటూరు:** లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి 177వ ఆరాధన మహోత్సవాలలో భాగంగా శుక్రవారం సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో ఔత్సాహిక కళాకారుల గాత్ర, వాయిద్య లఘు కచేరీలు ఆహూతుల్ని అలరించాయి. సాయంత్రం గాత్ర సంగీత సభలో బెంగళూరు సోదరులు విద్వాన్ ఎం.బి.హరిహరన్, ఎస్.అశోక్ త్యాగరాజ కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు.

### బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా రామచంద్రారెడ్డి



**బాపట్ల అర్బన్:** బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా కె.రామచంద్రారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చీరాల మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బాపట్లకు బదిలీ అయ్యారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎ.భాను ప్రతాప్ బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి బదిలీ అయ్యారు.

### రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా రామబోపాల్‌రెడ్డి

**రేపల్లె రూరల్:** రేపల్లె మున్సిపల్ కమిషనర్‌గా టి.రామబోపాల్‌రెడ్డి నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా హిందూపూర్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన రేపల్లెకు వచ్చారు. రేపల్లె కమిషనర్‌గా పనిచేస్తున్న బి.విజయసారథి చీరాల మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు.

### కొనసాగుతున్న బీజేపీ విజయ సంకల్ప యాత్ర

**గుంటూరు మెడికల్:** బీజేపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో బీజేపీ విజయసంకల్పయాత్ర శుక్రవారం స్థానిక చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద ప్రారంభమైంది. లక్ష్మీపురం, అశోక్ నగర్, పండరీపురం, కోబాల్ట్ పేట, అంకమ్మ నగర్ మీదుగా ఏటీ అగ్రహారంలో ముగిసింది. ముఖ్య అతిథులుగా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జి మకుటం శివ పాల్గొన్నారు. తొలుత గణతంత్ర దినోత్సవ సందర్భంగా జయప్రకాష్ నారాయణ చంద్రమౌళీ నగర్‌లోని కార్యాలయం వద్ద జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ జిల్లాకు ఇచ్చిన నిధులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు యాత్రలో వివరిస్తున్నామని తెలిపారు. పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని పేర్కొన్నారు. ఈదర శ్రీనివాస రెడ్డి, పాలపాటి రవికుమార్, ఆవుల నాగేంద్ర, ఏడుకొండల గౌడ్, వెంకటేష్, నరసింహారావు, ఏలూరి లక్ష్మి పాల్గొన్నారు.

## ఉత్తమ సేవకులు..


ప్రశంసా పత్రం అందుకున్న రేపల్లె అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు రెహమాన్

**రేపల్లె రూరల్:** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విభాగాలకు చెందిన అధికారులు ఉత్తమ సేవలకు గాను శుక్రవారం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా చేతుల మీదగా ప్రసంశా పత్రాలను అందుకుంటున్నారు. ఓల్డ్‌టౌన్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు అబ్దుల్ రెహమాన్, సేవా విభాగంలో అహ్మదీయ ఎడ్యుకేషన్ సొసైటీ నిర్వాహకుడు సయ్యద్ తాహెర్ అహ్మద్, పలువురు వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు ప్రసంశా పత్రాలను అందుకున్నారు.

- **భట్టిప్రోలు:** స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ సైకం నాగరాజు, వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు.
- **పిట్టలవానిపాలెం:** ఖాజీపాలెం వ్యవసాయ విస్తరణాధికారి చిప్పల సుదర్శనరావు అవార్డుకు ఎంపికయ్యారు.
- **చుండూరు(వేమూరు):** చుండూరు మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.లక్ష్మీనారాయణ అవార్డును అందుకున్నారు.


అవార్డును అందుకుంటున్న హెడ్ కానిస్టేబుల్ సైకం నాగరాజు


అవార్డు అందుకుంటున్న ఏఓ మీరయ్య


ప్రశంసా పత్రం అందుకుంటున్న ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ

### రేపు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**గుంటూరు మెడికల్:** అరండల్‌పేట 11వ లైనులోని ఆర్య సమాజంలో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఉచితంగా పరీక్షలు చేసి మందులు కూడా అందిస్తారని పేర్కొన్నారు. ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు

**తెనాలిరూరల్:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసులు నమోదు చేశారు. కొల్లిపరలో శుక్రవారం ఎస్‌ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇద్దరు వ్యక్తులు మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. ఇద్దరి వద్ద 22 సీసాలు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. అలానే బిల్లులు లేకుండ ఇసుక తరలిస్తున్న లారీని గుర్తించి స్వాధీనం చేసుకుని దుగ్గిరాల పోలీసులకు అప్పగించారు.

### పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



**తెనాలిటౌన్:** లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యులు మారా కుటుంబరావు సహకారంతో పెరుగు మార్కెట్ ఆవరణలో కార్మికులకు చీరలు, గాజులను క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కొణిజేటి రమేష్‌కృష్ణ, లయన్ వెచ్చా సాంబశివరావు, మున్సిపల్ కార్మికులు సంధ్య, కనకలక్ష్మి, రోజారమణి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.